ప్రజాశక్తి

మంగళవారం 7 ఫిబ్రవరి 2023

అనంతపురం



నేడు జీ-20 బృందం పర్యటన


ప్రజాశక్తి-లేపాక్షి

జి-20 దేశాల ప్రతినిధుల బందం మంగళవారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. కర్నాటక రాష్ట్రం పావగడ సోలార్ పార్క్ సందర్శన నిమిత్తం జి-20 దేశాల ప్రతినిధుల బందం మంగళవారం ఉదయం రానుంది. సోలార్ పార్క్ సందర్శన అనంతరం సాయంత్రం 4 గంటలకు లేపాక్షి ఆలయాన్ని సందర్శిస్తారు. ఈ మేరకు అధికారులు ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం సాయంత్రం అనంతపురం ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. శ్రీసత్యసాయి జిల్లా కొడికొండ నుంచి చిలమత్తూరు, మడకశిర, పావగడ సోలార్ పార్కు వరకు ఉన్న రహదారిపై పర్యటించి క్షుణ్ణంగా పరిశీలించారు. బందోబస్తు చర్యలపై ఆయా పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు.


విద్యుత్‌దీపాలంకరణలో లేపాక్షి ఆలయం

అంచనా తప్పిందా..!

- రూ.8 కోట్లు అనుకున్నది... రూ.80 కోట్లకు చేరింది..
- ఆ కొంచెం విస్తరణ జరిగేనా..?
- పనుల పూర్తిపై సందిగ్ధం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలో నిర్మితమవుతున్న ప్రధాన రహదారి అంచనా తప్పినట్టు కనిపిస్తోంది. బళ్లారి బైపాస్ నుంచి పంగల్‌రోడ్డు వరకు జరుగుతున్న రహదారి విస్తరణంలో ఒకచోట ప్రధాన అవరోధం ఏర్పడుతోంది. భూసేకరణ అంచనా వ్యయం భారీగా పెరిగే సూచనలు కనిపిస్తుండటంతో ఇప్పుడు ఏమి చేయాలో పాలుపోని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఎక్కువ రద్దీ నెలకుని ఉండే సప్తగిరి సర్కిల్ నుంచి ఐరన్ ఓర్ బ్రిడ్జి మధ్యన విస్తరణ పనులు ప్రారంభానికే నోచుకోలేదు. మొత్తం రహదారి నిర్మాణపు పనులు వేగంగా నడుస్తున్నా... ఈ కొంచెం ప్రాంతం మాత్రం మొదలవకండా ఉంది. పెరిగిన అంచనా వ్యయం నిధుల విషయంలో అధికార యంత్రాంగం తర్జనభర్జనల్లో ఉన్నట్టు తెలుస్తోంది.

అంతటా వేగం...

బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకు 9.2 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణను గతేడాది కేంద్రం నిధులతో ప్రారంభించారు. ఈ ప్రాంతానికి చెందిన అధికారి ఒకరు అక్కడ కీలకమైన పదవిలో ఉన్న సమయంలో ఆయన చొరవతో టవర్‌క్లాక్ వద్దనున్న రైల్వే బ్రిడ్జి మొదలుకుని మొత్తం నగరంలో ప్రధాన రహదారి విస్తరణకు మార్గం ఏర్పడింది. రూ.198 కోట్లతో ఈ పనులను ఎస్‌ఆర్ సంస్థ పనులను చేపట్టింది. పనులు ప్రారంభించినప్పటి నుంచి శరవేగంగా పనులను చేపడుతూ వచ్చింది. ఈ ఏడాది జనవరికే బ్రిడ్జి పనులు పూర్తవుతాయని కూడా భావించడం జరిగింది. అందుకు అనుగుణంగా పనులను ఆ సంస్థ చేపట్టినప్పటికీ మధ్యలో రైల్వే అనుమతుల్లో కాస్త జాప్యం జరిగింది. ఏది ఏమైనా ఈ మార్చి నాటికి పనులను పూర్తవుతాయని స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కూడా ఇటీవల ప్రకటించారు. రైల్వే లైన్‌పై వంతెన నిర్మాణానికి అవసరమైన అనుమతులను కూడా రైల్వే శాఖ ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఇచ్చినట్టు సమాచారం. ఆ సమయంలో రైల్వేట్రాక్ వద్ద కూడా నిర్మాణాలను పూర్తి చేయనున్నారు. ఇది పూర్తయితే తక్కిన ప్రాంతం పనులను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయనున్నారు.

కూడలిలో అవరోధం

ఈ రహదారి నిర్మాణం అంతటా సజావుగా సాగుతోందని భావిస్తుండగా, ఒక దగ్గర మాత్రం సమస్య వచ్చి పడింది. సప్తగిరి సర్కిల్ నుంచి ఐరన్ బ్రిడ్జి వరకు రహదారి విస్తరణ చేపట్టాలంటే రెండు ఎకరాల మేరకు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఇది రూ.8 కోట్ల వరకు సరిపోతుందని మొదట అంచనా వేశారు. అందుకు అనుగుణంగా టెండరులో నిధులు కేటాయించారు. కాని ఇప్పుడు ఆచరణలోకి వెళ్లినప్పుడు అది రూ.80 కోట్లకు చేరువైంది. ఇప్పుడు ఈ అదనపు వ్యయం నిధులు ఎక్కడి నుంచి తేవాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ప్రాజెక్టుకు సహకరించిన అధికారి ఇప్పుడు అక్కడ లేకపోవడం, మరో అవరోధంగా మారినట్టు సమాచారం. అదనపు నిధులు కోరితే ఆ శాఖ ఈ ఫైల్‌ను ఫైనాన్సుకు పంపినట్టు తెలుస్తోంది. అక్కడ అనుమతులు రాకపోతే రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడున్న పరిస్థితులు ఇన్ని నిధులను ఇస్తుందా.? లేదా.? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇదే పెద్ద సమస్యగా పూర్తి స్థాయి రహదారి విస్తరణకు ఇబ్బంది నెలకొన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సమస్యకు ఏ రకంగా పరిష్కారం లభిస్తుందన్నది చూడాల్సి ఉంది.


మహాధర్నాకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు


ప్రసంగిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- సమస్యల పరిష్కారంపై నిరసనబాట
- ఫేస్‌యాప్ హాజరును ఉపసంహరించాలి
- అంగన్‌వాడీలను విస్మరిస్తే జగన్‌కు పతనమే
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమస్యల పరిష్కారంపై అంగన్‌వాడీలు కదంతొక్కారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. సిఐటియు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నాడు మహాధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని మండిపడ్డారు. అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికే కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అందులో భాగంగానే కేంద్ర బడ్జెట్‌లో నిధులు కోత విధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తాను తక్కువ కాదన్నట్లు అనేక నిబంధనలు అమలు చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌ను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించాలని ప్రశ్నిస్తే పోలీసులతో అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడటం దుర్మార్గంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో వైఎస్‌ఆర్‌సిపి అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా మారుస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో వాటి ఊసే ఎత్తకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. సెంటర్ అద్దెలు, అరియర్స్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. కొత్తగా ఫేస్‌యాప్ హాజరు విధానం తీసుకొచ్చి తీవ్ర ఇబ్బందులు సృష్టించారన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు ఇవ్వమంటే ప్రభుత్వం ఒప్పుకోవడం లేదని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఫేస్‌యాప్ హాజరు, తదితర నిబంధనలు మాత్రం అమలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలను విస్మరిస్తే ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. టిడిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినందుకు ప్రతిపక్షంలో కూర్చొబెట్టారని, అదే విధానం అనుసరిస్తున్న జగన్ ప్రభుత్వం వైఖరి మారకుంటే ప్రతిపక్షంలో కూడా లేకుండా చేస్తారన్నారు. హక్కులపై ప్రశ్నించే స్వేచ్ఛను కూడా హరిస్తామంటే సహించేది లేదన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ అంగన్‌వాడీలపై రాజకీయ ఒత్తిళ్లకు పాల్పడటం మానుకోవాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శకుంతల, జె.రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఫేస్‌యాప్‌లకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వ ఉద్యోగుల తరహా సౌకర్యాలు కల్పించిన తరువాతనే దానిని అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వి.జమున మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. ఈ ధర్నాకు ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, సిఐటియు జిల్లా నాయకులు వెంకటనారాయణ, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, భవన నిర్మాణం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజినేయులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాల రంగయ్య, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, డివైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి తదితరులు మద్దతు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీలు కలెక్టరేట్‌లో ఐసిడిఎస్ పీడీ శ్రీదేవిని కలిసివినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


అంగన్‌వాడీల మహాధర్నా సందర్భంగా అభివాదం చేస్తున్న సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రాష్ట్రంలో మారుతున్న సమీకరణాలు

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
భీమిరెడ్డి సేవలు మరువలేనివి
మంత్రులు పెద్దిరెడ్డి, బుగ్గన

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయని మంత్రులు భూగర్భ గనుల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కొనకొండ్ల రోడ్డులో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే ఎల్లారెడ్డి భీమిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ దివంగత ఎల్లారెడ్డి భీమిరెడ్డి నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. తండ్రి బాటలోనే తనయులు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, శివరామిరెడ్డి ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీగా ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ఇకపోతే రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు వేగవంతంగా మారుతున్నాయన్నారు. ఇందులో భాగంగా టిడిపితో పాటు ప్రతిపక్ష పార్టీలు సిఎం జగన్ పరిపాలనపై బురద చల్లుతున్నాయన్నారు. అయితే ప్రజలు ఇలాంటివి నమ్మే స్థితిలో లేరన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సిఎం జగన్‌తోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. ఇందుకు ఈ సభకు వచ్చిన ప్రజానీకమే సాక్ష్యం అన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భీమిరెడ్డి ఉద్యానవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు సాయిప్రతాప్‌రెడ్డి, అనంత వెంకట రామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఆర్‌డిఒ రవీంద్ర, డీఎస్పీ నర్సింగప్ప, గుంతకల్లు, గుత్తి, పామిడి మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్లు, మండలాల ఛైర్మన్‌లు, కమిషనర్లు, తహశీల్దార్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం సరికాదు..:సిఐటియు

ప్రజాశక్తి-కణేకల్లు

సిఐటియు అంగన్‌వాడీ వర్కర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బిఎంఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె.నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. సిఐటియు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులపై అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిఐటియు అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ చీలికల కోసం లేనిపోని ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. సిఐటియు అనుబంధంగా ఉన్న ప్రతి సంఘంలో సభ్యుల నుంచి సంవత్సరానికి ఒకసారి యూనియన్ సభ్యత రుసుం తీసుకోవడం సర్వసాధారణం అన్నారు. దీన్ని బిఎంఎస్ వారు వక్రీకరించి అక్రమ వసూలు అనడం సరైంది కాదన్నారు. యూనియన్ అధ్యక్షుల పేర్లతో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించిన బిఎంఎస్ నాయకులపై అవసరమైతే పరువు నష్టం దావా కేసు పెడతామని హెచ్చరించారు.

అంగన్‌వాడీలను నిర్బంధించడం హేయమైన చర్య

సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసనకు వెళ్తున్న అంగన్‌వాడీలను నిర్బంధించడం హేయమైన చర్య అని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ మండిపడ్డారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు 48ఏళ్లుగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అనేక సేవలిందిస్తున్నారన్నారు. అలాంటి వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించని ప్రభుత్వం ఫేస్ యాప్ ఎందుకు తీసుకొచ్చిందని ప్రశ్నించారు. వెంటనే అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.26వేల వేతనం, మెనూ ఛార్జీల పెంపు, పెండింగ్ టిఎ బిల్లులు, మెయిన్ సెంటర్ల ఏర్పాటు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ఎఒకు వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు వంశీ, అంగన్‌వాడీలు అనసూయమ్మ, కొల్లమ్మ, లక్ష్మి, వన్నమ్మ, మంజుల, కొల్లమ్మ, తిమ్మక్క, సాకమ్మ, మారెక్క, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ఇళ్లు, స్థలాల సమస్యలు పరిష్కరించాలి

తహశీల్దార్‌కు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ మండల పరిధిలోని నిరుపేదలకు ఇళ్లు, స్థలాల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పేదలు సొంతిళ్లు లేక అద్దె ఇళ్లల్లో ఉంటూ అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి గుడిసెలు వేసుకుని జీవిస్తున్నా పట్టాలివ్వడం లేదన్నారు. తక్షణమే ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి వారంరోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు మన్నీల రామాంజీ, ప్రకాష్, వలీ, మసూద్, బాబు, జీవ, ఎన్టీఆర్ శీను, ఆటో యూనియన్, శివ, వన్నూరు, పాండు, ఎస్‌కె మహమ్మద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

నేడు అదానీ సోలార్ భూముల లీజుపై సదస్సు

హాజరు కానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అదానీ గ్రీన్ ఎనర్జీ పేరుతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో సేకరించిన 48 వేల ఎకరాల రైతుల భూములకు సంబంధించిన చెల్లింపులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 'రైతులకు శాపమా.. వరమా' అనే అంశంపై నేడు సదస్సు నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి ఎన్జీఓ హోంలో నిర్వహించనున్న ఈ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య వక్తగా హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నెడ్‌కాప్ ద్వారా అదానీ కంపెనీకి మధ్యవర్తిత్వం వహిస్తుందే కానీ లీజు విషయంలో తేల్చడం లేదన్నారు. అదానీ అసలు రూపాన్ని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ అనే సంస్థ బయటపెట్టడం, ఎల్‌ఐసితో పాటు అనేక బ్యాంకుల్లో ఆయన తీసుకున్న రుణాల సమస్య, కంపెనీల షేర్ల పతనం, చివరకు అదానీ గ్రూపునకు అప్పులు ఇవ్వడానికి ఆర్థిక సంస్థలు నిరాకరించడం జిల్లా రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆయా సమస్యలపై చర్చించేందుకు నిర్వహించనున్న సదస్సులో రైతులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వాలంటీర్ ఆత్మహత్య

కుటుంబ కలహాలే కారణం..

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల కేంద్రానికి చెందిన గిరిమల్లెప్ప కుమారుడు బీపీ నవీన్‌కుమార్ (34) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నవీన్‌కుమార్ నాలుగేళ్ల నుంచి వాలంటీర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. అయితే నాలుగేళ్ల క్రితం కర్నూలు జిల్లా అవుకు గ్రామంలో వివాహం చేసుకున్నాడు. కొన్నేళ్లుగా వీరి దాంపత్య జీవితం సాఫీగా సాగింది. అయితే సంతానం కలగకపోవడంతో ఈమధ్యకాలంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. గతేడాది నుంచి భార్య పేరిట భూమి చేయాలని నవీన్‌కుమార్‌పై భార్య తండ్రి ఒత్తిడి తీసుకొచ్చాడు. దీంతో సమస్య మరింత జఠిలమైంది. ఓవైపు కుటుంబ కలహాలు.. మరోవైపు సంతానలేమితో బాధపడుతున్న సమయంలో భార్య పుట్టింటికి వెళ్లింది. ఈనేపథ్యంలో ఒంటరి ఉంటూ జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున సొంతిట్లో చీరతో ఇనుప దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతసేపైనా తలుపు తీయకడంతో అతికష్టం మీద డోర్ పగలగొట్టి చూడగా అప్పటికే మృతి చెందినట్లు భావించారు. మతి చెందిన చోటే 'నా సావుకు కారణం నేనే.. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంటున్నా..' అంటూ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ పరశురాముడు ఘటనా స్థలానికి చేరుకుని తండ్రి గిరిమల్లప్ప ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు

రాయదుర్గం : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐదు నుండి 15 సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ నమోదు కోసం పట్టణంలో రెండు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈనెల 7వ తేదీ నుంచి పదవ తేదీ వరకు ఏర్పాటు చేయనున్న ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పని చేస్తాయన్నారు. వీటితోపాటు బయోమెట్రిక్ అప్డేషన్, ఫోన్ నెంబర్ లింక్, మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆత్మకూరు ఎంపీడీవోగా విజయ్‌ప్రసాద్

ఆత్మకూరు : ఆత్మకూరు ఎంపిడిఒగా విజయ్‌ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఏ సమస్య తన దృష్టికి వచ్చినా సిబ్బంది అందరి సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు. అనంతరం ఎంపిడిఒను సిబ్బంది అభినందించారు.

బలిజ సంఘం నూతన కమిటీ ఎన్నిక

బొమ్మనహాల్ : దేవగిరి క్రాస్‌లో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో బొమ్మనల్ బలిజ సంఘం మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా నాగభూషణ, సెక్రటరీగా రంజిత్ కుమార్, జాయింట్ సెక్రెటరీగా నాగరాజ్, ట్రెజరర్‌గా భాస్కర్, జాయింట్ ట్రెజరర్‌గా గోవిందప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పుస్తకాలు వితరణ

నార్పల : ఎన్‌కెసి సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలకు గ్రంథాలయ పుస్తకాలను సోమవారం వితరణ చేశారు. డిక్షనరీలు, పెద్దబాలశిక్షలు, ఇంగ్లీష్ గ్రామర్, నీతి కథలు, నైతిక విలువల కథలు, సాహిత్య గ్రంథాలు, జనరల్ నాలెడ్జ్ మొదలైన పుస్తకాలతో పాటు పుస్తకాలను భద్రపరిచే లైబ్రరీ ర్యాక్‌ను సేవా సమితి అధ్యక్షులు నీలయ్య, కమల్‌నాథ్, కార్యవర్గ సభ్యులు ఆకుల రఘురామయ్య ప్రిన్సిపల్ నిర్మలకు అందజేశారు. సేవాసమితి అధ్యక్షులు కమల్‌నాథ్ మాట్లాడుతూ.. విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమాజం పట్ల సరైన దృక్పథంతో ఆలోచించాలని ఆకాంక్షించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

యూనిఫైడ్ కౌన్సిల్ సెకండ్ లెవెల్‌కి శ్రీ చైతన్య విద్యార్థులు

అనంతపురం : స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో చదువుతున్న ఏడవ తరగతికి చెందిన బురహానుద్దీన్, ఆరవ తరగతికి చెందిన లీలా చేతన్ అక్టోబరులో యూనిఫైడ్ కౌన్సిల్ వారు నిర్వహించిన లెవెల్ వన్ పరీక్షలో నెగ్గి రెండవ లెవెల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి అభినందించారు. ప్రిన్సిపల్ తబస్సుం, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్ లు రుషిబాల, అప్పలనాయుడు ఏవో గోపాల్ పాల్గొన్నారు.

అక్రమ కుళాయిలు తొలగించకుంటే ఫైన్

నార్పల : నార్పల మేజర్ పంచాయతీలో అనుమతులు లేకుండా అక్రమంగా కుళాయిలు వేసుకొని ఉంటే మూడు రోజుల్లో తొలగించాలిన, లేనిపక్షంలో అపరాధ రుసుం విధిస్తామని పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు తెలిపారు. అక్రమంగా కుళాయిలు వేసుకున్న వారు మూడు రోజుల్లోపు గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి రసీదు పొందాలన్నారు. లేనిపక్షంలో కుళాయి కనెక్షన్లు తొలగించడంతో పాటు అపరాధ రుసుము విధిస్తామని హెచ్చరించారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం పరిశీలన

ఆత్మకూరు : ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో ఏర్పాటు చేయబోయే స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం పూర్తి కావడంతో నిర్వాహకులు సోమవారం తెనాలి వెళ్లి పరిశీలించారు. ప్రముఖ శిల్ప రవిచంద్రకు విగ్రహానికి సంబంధించిన డబ్బులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బైరెడ్డి, ప్రచార కార్యదర్శి ఆర్.రామకృష్ణారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి సూర్యచంద్రారెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు రేనాటి నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి



శింగనమలలో వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న పునాదులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓ.నల్లప్ప మాట్లాడుతూ.. 2018లో గ్రామ సర్వే నెంబరు 790-1, 790-2లో పేదలు ఇళ్ల పునాదులు వేసుకున్నారన్నారు. దీనిపై అప్పటి తహశీల్దారు ఆర్డీవోకి నివేదికను కూడా పంపారన్నారు. స్పందించిన ఆర్డీవో సమస్యను పరిష్కరించాలని తహశీల్దారును ఆదేశించారన్నారు. 2018లో 80 మంది పేదలు పునాదులు వేసుకున్నారని, వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. స్పందించిన తహశీల్దారు విచారణ చేపట్టి అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, పుల్లయ్య, సంజీవరెడ్డి, నాగేంద్ర, నెట్టికంటయ్య తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి పట్టా ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి డిమాండ్. సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దారు ఈశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల్లో పేదలకు ఇళ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కల్లుమడి గ్రామంలో ప్రభుత్వ భూమిలో సాగుచేసుకుంటున్న కుటుంబాలకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలని, ఉల్లికంటిపల్లి, నిదనవాడ గ్రామాల్లో శ్మశానవాటికకు స్థలం మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాసం మండల కార్యదర్శి సుంకన్న, ఎర్రిస్వామి, లక్ష్మీపతి జయరాముడు, మేకల పెద్దన్న, బేల్దారి పెద్దన్న, ధనుంజయులు, నాగరాజు, ఓబులరాయుడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దారు మల్లేష్‌కి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి డి.పెద్దయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రమేష్, పెద్దిరాజు, ఎం.రాజు, దావీదు, ఓబుళపతి, పెద్దన్న, రమేష్, సుధాకర్ చిన్న గంగన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలతో చెలగాటమాడొద్దు



నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-ఉరవకొండ

కార్మికుల జీవితాలతో చెలగాటమాడటం మానుకుని, బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సత్యసాయి ప్రాజెక్టు యూనియన్ సెక్రటరీ పరుశురాం పేర్కొన్నారు. ఉరవకొండ మండల పరిధిలోని పెద్దకౌకుంట్ల గ్రామంలో సత్యసాయి యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు 6వ రోజు కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ పాలకులు మారినా, అధికారులు మారినా కార్మికుల తలరాతలు మారలేదన్నారు. పనులు చేయించినంత బాధ్యతతో చేసిన పనులకు జీతాలు ఇవ్వాలన్న కనీస ఆలోచన లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాలుగు నెలలుగా కార్మికులకు ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రావాల్సిన గ్రాడ్యుటీ ఫండ్‌తో పాటు పిఎఫ్, ఈఎస్ఐ గుర్తింపు కార్డులు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో కలిసొచ్చే కార్మిక ప్రజాసంఘాల సహకారంతో ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి యూనియన్ నాయకులు మల్లికార్జున, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధావదూతల రథోత్సవం

ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మండలం వెలిగొండ గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ గురు సిద్ధావదూతల రథోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగలముఖి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచి వీరాంజనేయులు, వైసిపి నాయకులు నాగప్ప ఆధ్వర్యంలో గ్రామస్తులు విశ్వేశ్వరరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన వైస్ ఎంపిపి ఇంట్లో విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు సుధాకర్, చెన్నకేశవులు, లాలూ, సిద్ధప్ప, చెన్నరాయుడు, శంకరప్ప, ఎర్రిస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఊరేగిన రంగనాథుడు

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పారువేట ఘనంగా నిర్వహించారు. స్వామివారిని అశ్వవాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి వి.దేవదాసు, సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్, అర్చకులు పాల్గొన్నారు.

కోనా నివాసంలో మంత్రికి తేనీటి విందు



తేనీటి విందులో పాల్గొన్న మంత్రి బుగ్గన

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి డోన్ నియోజకవర్గ పరిశీలకులు, గుత్తి మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి సోమవారం తేనేటి విందు ఇచ్చారు. గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే వై.భీమిరెడ్డి విగ్రహావిష్కరణకు మంత్రి వస్తుండగా కోనా మురళీధర్ రెడ్డి, వైసిపి నాయకులు జిల్లా సరిహద్దులో శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి గుత్తిలోని కోనా ఇంటికి ఆయన చేరుకున్నారు. అక్కడ కోనా మురళీధర్ రెడ్డి, ఆయన సతీమణి కోనా శ్రీలత రెడ్డి, కుమారుడు నిశాంత్‌రెడ్డి శాలువా, పూలమాలతో సన్మానం చేశారు. అలాగే ఆయన్ను పలువురు వైసిపి నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కోనా కుటుంబ సభ్యులు ఆయనకు తేనేటి విందును ఏర్పాటు చేశారు. అనంతరం చారిత్రక కట్టడాలు గల గుత్తి కోట అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయాలని కోనా మురళీధర్ రెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. అధికారులతో ప్రతిపాదనలు పంపించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాయలసీమ విమోచన సమితి కన్వీనర్ వై.రాజశేఖర్ రెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు క్రషర్ మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్లు ఫారుక్, వాల్మీకి శివ, నాయకులు సివి.రంగారెడ్డి, గురుప్రసాద్, ఎ.సూర్యనారాయణరెడ్డి, శివకుమార్, బింగి బాబు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసంత్ సేవాలాల్ ఉత్సవాలకు నిధులు ఇవ్వాలి



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సేవాఘడ్ ట్రస్ట్ ఉపాధ్యక్షులు కేశవ నాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థ నాయక్, కోశాధికారి రవీంద్ర నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం బంజారా భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ 13న సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి రూ.25 లక్షలు ఇవ్వడం అనావాయితీగా వస్తోందన్నారు. గత ప్రభుత్వాలు కూడా ఇస్తూ వచ్చాయని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు ఇవ్వకపోవడం విచాకరం అన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ దేవాలయాల నిర్మాణాలకు, అభివృద్ధికి కర్నాటక, తెలంగాణా, మహారాష్ట్ర, ప్రభుత్వాలు రూ.కోట్లు మంజూరు చేస్తూ బంజారాలను ప్రోత్సహిస్తున్నారని గుర్తు చేశారు. జిల్లాలో పుట్టిన సేవాలాల్ మహరాజ్ ఈ ప్రాంత బంజారాలను వెలుగులోకి తెచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విరివిగా నిధులు ఇవ్వాల్సింది పోయి నిర్లక్ష్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఏడాది అయినా ఉత్సవాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఎఐబిఎస్ఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ అనంతపురం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సేవాఘడ్ ట్రస్ట్ ఉపాధ్యక్షులు కేశవ నాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్, ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరమణా నాయక్, చక్రె నాయక్‌లు తెలిపారు. ఎఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులుగా ఎస్.బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శిగా పి.బాబునాయక్, కోశాధికారిగా నారాయణస్వామి నాయక్, గౌరవాధ్యక్షులుగా సి.అశ్వర్థనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.వెంకటరమణ నాయక్, ఉపాధ్యక్షులుగా కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా సుగుణబాయి, శివమణిబాయి, ఉమాబాయిలను ఎన్నుకున్నట్లు తెలియజేశారు.

ఎమ్మెల్యే పెద్దారెడ్డి పాదయాత్ర లాభదాయకమే

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పెద్దారెడ్డికి సంఘీభావంగా పాదయాత్రలో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పెద్దవడుగూరు మండలంలో చేపట్టిన ప్రజాసంక్షేమ పాదయాత్ర వల్ల వైసిపికి లాభదాయకమేనని భూగర్భ గనులశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిత్రచేడు గ్రామం నుంచి చిట్టూరు, గంజిగుంటపల్లి, నాగలాపురం, వీరన్నపల్లి మీదుగా పెద్దారెడ్డి పాదయాత్ర కొనసాగగా ఇన్‌ఛార్జి మంత్రితోపాటు హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రాయదుర్గం, అనంతపురం ఎమ్మెల్యేలు కాపు రామచంద్రారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్తు ఛైర్మన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఆహుడా ఛైర్మన్ మహలక్ష్మి శ్రీనివాస్, రాష్ట్ర నాటక అకాడమి ఛైర్మన్ హరిత, తాడిపత్రి మార్కెట్ యార్డు ఛైర్మన్ హరినాథరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ శరభారెడ్డి, శేషారెడ్డి, వెంకటస్వామి గౌడు, రంగస్వామి యాదవ్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పెద్దారెడ్డి మండలంలో 140 కి.మీ వరకు పాదయాత్ర చేపట్టగా ప్రస్తుతం వంద కిలోమీటర్ల వరకు పూర్తి చేశారన్నారు. ఈ పాదయాత్రతో తాడిపత్రి నియోజకవర్గంలో వైసిపి గెలుపు సునాయాసంగా మారనున్నదని చెప్పారు. ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను చేపట్టడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ఎమ్మెల్యేలు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి ప్రజల మనసును చూరగొంటున్నారన్నారు. దీంతో అన్ని స్థానాల్లో వైసిపి గెలుపు తథ్యమన్నారు. అనంతరం ఆయన పాదయాత్రకు సంఘీభావం ప్రకటించి ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని పెద్దారెడ్డికి సూచించారు. పార్టీని వీడేందుకు కోటంరెడ్డి ఆయుధాన్ని ఇలా ఎంచుకున్నారు. నెల్లూరు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసిపిని వీడేందుకే ఫోన్ ట్యాపింగ్ సాకులు అనే ఆయుధాన్ని ఎంచుకున్నారని పేర్కొన్నారు. పార్టీలో ఇమడలేక లేనిపోని ఆరోపణలు శ్రీధర్‌రెడ్డి చేస్తున్నారన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గన్‌మెన్లను తిరస్కరించడాన్ని విలేకరులు ప్రశ్నించగా.. ఇది చిన్న సమస్య.. నేను చెప్పదలుచుకోలేదని దాటవేశారు.

నారాయణ కళాశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా నాయకులు అరెస్ట్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న భవ్యశ్రీ ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాలలో చదువుతున్న భవ్యశ్రీ ఫీజు పెండింగ్ ఉండటంతో కళాశాల యాజమాన్యం ఫీజు కట్టాలని తోటి విద్యార్థుల నడుమ అవమానాలకు గురిచేశారు. ప్రాక్టికల్ రికార్డులు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడటంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లింది. కళాశాలపై నుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికంగా ఉన్న కళాశాల సిబ్బంది విద్యార్థినిని కిమ్స్ సవీరా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థి ఆత్మహత్యయత్నం సంఘటనను తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. అదనంతరం విద్యార్థి సంఘాల నాయకులు నారాయణ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుళ్లాయిస్వామి, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పృధ్వీ, ఎపిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాఘవేంద్ర హాజరై ధర్నా నిర్వహించారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రి పొద్దుపోయినా నాయకులను విడుదల చేయలేదు. విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులను ఇలా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

నేరాలు ఘోరాలు

పదిమంది ఎర్రచందనం కూలీలు అరెస్ట్

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు మండలంలో 10 మంది ఎర్రచందనం కూలీలను సోమవారం తెల్లవారుజామున తాడిపత్రి డీఎస్పీ చైతన్య, పుట్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతపురం-తాడిపత్రి ప్రధాన రహదారిపై తమిళనాడుకు చెందిన ఎర్ర చందనపు కూలీలు కడప ప్రాంతానికి వెళ్తుండగా పుట్లూరు ఎస్ఐ వెంకటప్రసాద్ తన సిబ్బందితో కలిసి ఎ.కొండాపురం వద్ద వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక కారు, ఐదు గొడ్డళ్లు, ఒక రంపం, ఒక వేవింగ్ మెషీన్, పది సెల్‌ఫోన్లు, రూ.10,680 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. ఇద్దరు కూలీలు తప్పించుకున్నారని, వారికోసం గాలిస్తున్నామని తెలియజేశారు.

అక్రమ మద్యం, నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

కర్నాటక రాష్ట్రానికి చెందిన మద్యం, 48 టెట్రా ప్యాకెట్లను సోమవారం పట్టుకున్నట్లు తాడిపత్రి రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూరల్ సిఐ చిన్న పెద్దయ్యకు రాబడిన సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ, సిబ్బంది తాడిపత్రి రూరల్ పరిధిలోని కడప రోడ్డులోని హీరో షోరూమ్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఒక ప్యాసింజర్ ఆటోను తనిఖీ చేయగా అందులో కర్నాటక రాష్ట్రం నుండి అక్రమంగా తీసుకువచ్చిన మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం సరఫరా చేస్తున్న నిందితుడు ఆదివిరెడ్డిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఆటోను సీజ్ చేసినట్లు తాడిపత్రి రూరల్ ఎస్ గౌస్ మొహమ్మద్ తెలిపారు.

ఎస్‌కెయులో సప్లిమెంటరీ పరీక్షలకు అనుమతివ్వాలి

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు, ఇయర్ వైజ్, సెమిస్టర్ వైజ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసుకునేందుకు అనుమతి ఇవ్వాలని పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య రమణకు వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు పి.హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది విద్యార్థులకు ఒకటి, రెండు సబ్జెక్టులు మిగిలిపోయాయన్నారు. దీంతో వారు డిగ్రీ సర్టిఫికెట్ తీసుకోలేక పోతున్నారన్నారు. వారందరిని దృష్టిలో పెట్టుకొని మానవతా దృక్పథంతో వారు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు బీదాల జయచంద్రారెడ్డి, సంగాల మధు, దినేష్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8న ఆల్‌ఇండియా ప్రజాసేన హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

ఆల్ ఇండియా ప్రజాసేన హక్కుల పోరాట సమితి 6వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నగర కార్యదర్శి జగదీష్ నాయుడు తెలిపారు. ఆల్ ఇండియా ప్రజాసేన హక్కుల పోరాట సమితి నాణ్యమైన విద్య, ఉపాధి, ఆరోగ్యం, మహిళా సాధికారత ప్రధాన లక్ష్యాలుగా స్థాపించబడిందని తెలిపారు. తమ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మన్నెపాకుల మాధవ్ సారథ్యంలో ప్రజాసేవే పరమావధిగా సమాజ నిర్మాణం కోసం, పౌర హక్కుల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటం చేసేందుకు తాము సిద్ధమయ్యామని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు అధికమయ్యాయని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వేరే పథకాలకు మళ్లించి దళిత సంక్షేమాన్ని పూర్తిగా పక్కన పెట్టింది వైసిపి ప్రభుత్వమే అన్నారు. నవరత్నాలలో భాగంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని ఒట్టి మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారు. ఇలాంటి సమస్యలను పరిశీలించి ప్రజా సంక్షేమం వైపు అడుగులు వేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకు తమ సంఘం సభ్యులు ప్రజా చైతన్యం వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆల్ ఇండియా ప్రజా సేన హక్కుల పోరాట సమితి ఆరవ ఆవిర్భావ దినోత్సవం అన్ని వర్గాల వారు మతాలవారు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పది విద్యార్థులకు మోడల్ టెస్ట్

ప్రజాశక్తి-అనంతపురం

ఎఐఎస్ఎ జిల్లా కార్యదర్శి అబ్దుల్ ఆలం ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం మోడల్ టెస్టు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్, నలంద జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఖాజీ బాబు, ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల ఛైర్మన్ విశ్వనాథ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, ప్రజా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాములు తదితరులు హాజరై మోడల్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థుల సమస్యలపైన పోరాటమే కాకుండా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా విద్యార్థులు మంచి మార్కులు సాధించాలన్న ఉద్దేశంతో మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్న ఎఐఎస్ఎ విద్యార్థి సంఘాన్ని వారు అభినందించారు. విద్యార్థులు బాగా చదివి త్వరలో జరగబోయే పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎ జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రతిభా భారతి, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, నాయకులు శ్రీకాంత్, పవన్, గణేష్, పిడిఎస్‌యు నగర అధ్యక్షులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు పరిష్కారం: కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై స్పందనలో అందించే అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారుల ప్రజల అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖహాజరును వందశాతం అమలు చేయాలన్నారు. స్పందన కార్యక్రమానికి సంబంధించి అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. త్వరలో రానున్న ఎమ్మెల్సీ ఎలక్షన్లకు సిబ్బంది వివరాలను కోరడం జరిగిందని, ఇంకా 70 శాఖలకు సంబంధించి వివరాలు పంపించాల్సి ఉందన్నారు. వెంటనే వారు ఆ వివరాలను కలెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 8000 ఇళ్లు నిర్మించామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ఉగాది నాటికి మొత్తం నాటికి మొత్తం 20,000 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్న లక్ష్యానికి మరో 12,000 ఇళ్లు నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. జిల్లాలో ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్ శర్మ మంగళవారం నాడు పర్యటిస్తారన్నారు. నాడు-నేడు భవనాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, గ్రామ వార్డు సచివాలయ భవనాలు, ఆర్‌బికెల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, ఆస్నెట్ సీఈవో కేశవ నాయుడు, సీపీవో ప్రేమ్‌చంద్, పంచాయతీ రాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, స్పందన తహసీల్దార్ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం